క్లుప్తంగా

త్వరితగతిన సర్వే

సీతంపేట: 0 – 5 సంవత్సరాల చిన్నారులు, గర్భిణులు ఎంతమంది ఉన్నారనే సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



గిరిజన రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఆర్‌బీకే సిబ్బంది

కురుపాం: గిరిజన రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని నీలకంఠాపురం గ్రామ సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులకు పీఎంపీఎస్ ఖరీఫ్ ప్రధాన పంటలకుగాను 30 కేజీల విత్తనాలు 12 కేజీల చొప్పున పంపిణీ చేపట్టారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకర పంటలను పండించాలన్నారు. ఆర్‌బీకే వీహెచ్‌ఏ చందూలాల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్.ఎఫ్.ఎల్ ఆర్.గంగాధర్, ఐసీఆర్‌పీ బిడ్డిక భాస్కరరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు సచివాలయం పరిధిలో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని విలేజ్ అగ్రికల్చర్ సహాయకులు అమిత్‌పాడి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగు భూమిలో సారం పెంచేందుకు సహకరించే పచ్చిరొట్ట సేద్యానికి ఇదే సరైన సమయమన్నారు. రైతుల సౌలభ్యం కోసం 10 కేజీల బ్యాగులు అందుబాట్లో ఉన్నాయని, దీని ధర రూ.395 అన్నారు. ఈ బ్యాగులు ప్రస్తుతం ఆర్‌బీకేలో అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డును తీసుకువచ్చి విత్తనాలు పొందవచ్చన్నారు.

ముమ్మరంగా పీఎం కిసాన్ నమోదు



నేరడి-బిలో నమోదు చేస్తున్న ఏఏ ఈశ్వరరావు

భామిని: మండలంలోని పీఎం కిసాన్ – వైఎస్సార్ రైతుభరోసా జాబితాలో లేని అర్హులైన రైతుల పేర్లు నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు ఏఓ కె.సింహాచలం బుధవారం తెలిపారు. అర్హత ఉన్న రైతులు ఈకేవైసీలో వెసులుబాటు కల్పించి ఫేషియల్ యాప్ ద్వారా చేర్చుతున్నట్టు పేర్కొన్నారు. లేవలేని పరిస్థితుల్లో ఉన్నవారు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి వ్యవసాయ సహాయకులు పేర్లు నమోదు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ యాప్ ద్వారా 94 మందిని చేర్చినట్టు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ చిలకలపల్లి, పెదపెంకి ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామాల్లో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వల్ల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, భోజనం, బ్యాగులు, షూలు, యూనిఫాం పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో మంచి పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. వాటికి తోడు మంచి విద్యను బోధించే ఉపాధ్యాయులు ఉన్నారని వారితో సబ్జెక్టుల వారీగా విద్యాబోధన సాగుతుందని తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే పదవ తరగతి పరీక్షల్లో మండల ఫస్ట్, సెకెండ్, థర్డ్ స్థానాలు పొందారని తెలిపారు. అందులో భాగంగా చిలకలపల్లిలో 3వ తరగతికి వచ్చే విద్యార్థులు 16మంది ఉన్నారని, వారి తల్లిదండ్రులను కలవగా అందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తామని హామీఇచ్చారని ప్రధానోపాధ్యాయుడు ఎం.గౌరీశంకర్ తెలిపారు. కార్యక్రమంలో డి.జానకి, కె.ఎస్ఎన్ మూర్తి, ఆర్.శంకరరావు, సురేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరకు సాగుపై రైతుల దృష్టి

సీతానగరం: వాణిజ్య పంట చెరకు సాగుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించడం, రాయితీపై క్రిమి సంహారక మందులు సమకూర్చడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నీటివనరులున్న గ్రామాల రైతులు ఖాళీగా ఉన్న భూమిని చదును చేసి చెరకు విత్తనం వేయడానికి అనుకూలంగా ఉండడం, పొలం పనులు తగ్గుముఖం పట్టడంతో పలుగ్రామాల్లో చెరకు విత్తనం నాటుతున్నారు. చెరకు సాగు పనుల దృశ్యాలిలా ఉన్నాయి.

జగనన్నతోనే సుస్థిర పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారుకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగించాల్సిన అవసరం ఉందని, అది ఒక్క వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం మండలం తెట్టంగిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తెట్టంగి గ్రామాన్ని 2017 సెప్టెంబర్ 11న టీడీపీ నేత సందర్శించినప్పుడు అప్పటిలో ముఖ్యమంత్రి హోదాలో వచ్చి హామీలు గుప్పించారని, ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలను తర్వాత టీడీపీ గాలికొదిలేసిందని తెట్టంగి ప్రజలకు ఎమ్మెల్యే కళావతి గుర్తు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామ భౌగోళిక రూపం పూర్తిగా మారిపోయిందన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు ప్రజల ఆశీస్సులు కావాలని కోరారు. మరో 25 ఏళ్ల పాటు జగన్ మోహనరెడ్డే రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అందుకు ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న వలంటీరు వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తోందన్నారు. నవరత్న పథకాల ద్వారా గ్రామాల్లోని కోట్లాది మంది నిరుపేద కుటుంబాలు లబ్ధి పొందడంతో పాటు వారి జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రజలకు అందుబాటులో నిర్మించి ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలతో రైతులను, మహిళలతో పాటు అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి, కొన్ని పథకాలు ప్రజలు అడగకుండానే వారికి చేరువ చేసి దేశంలోనే నంబర్ వన్ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం పని చేస్తూ అర్హతే ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజు రోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కానీ ప్రజలు టీడీపీ నాయకుల మాటలు విశ్వసించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

తప్పుడు ఆరోపణలు తిప్పికొట్టాలి

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేసే ఉద్దేశం లేని టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప గడపకు అందుతుంటే ప్రజలకు ఏం చెప్పాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్న టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. అనుకూల మీడియాతో ప్రభుత్వ పథకాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, ఎంపీపీ వెంకటరమణనాయుడు, సర్పంచ్ అలజంగి విజయ, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ పరిశినాయుడు, ఎంపీటీసీ సతివాడ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, నీలం సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ నార్త్ కోస్తా రీజనల్ ఆఫీసర్ కె.ప్రకాష్ అన్నారు. బిత్రపాడు రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల కిట్లు రైతులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులతో పాటు సుస్థిర ఆరోగ్యం పొందగలమని, ఈ పంటలను ఉపయోగించడం వలన కరోనా వంటి మహమ్మారినీ జయించవచ్చన్నారు. నేలను 365 రోజులు కప్పి ఉంచాలని, అన్ని రకాల పంటలు వేయడం వలన అన్ని రకాల పోషకాలు ప్రధాన పంటకు అందుతాయని అన్నారు. భూమిని సారవంతం చేసుకోవడానికి 20 నుంచి 30 రకాల విత్తనాలను ఎకరానికి 10 కేజీల చొప్పున తొలకరి వర్షాలు ముందు పొలంలో వేసుకోవాలని, 45 రోజుల తరువాత భూమిలో కలియదున్ని వేయడం వలన ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సంపూర్ణంగా లభించి దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జి జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి ధనుంజయరావు, వీఏఏ శ్రీహరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఇన్‌చార్జి డీఎంఓ



తుంబకొండలో స్ప్రేయింగ్ పరిశీలిస్తున్న డీఎంఓ శ్యాంకుమార్

సీతంపేట: దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి జిల్లా మలేరియా నివారణాధికారి(డీఎంఓ) బుధవారం పరిశీలించారు. రికార్డులను, హాజరు పట్టికను చూశారు. మందులు అందుబాటులో ఉన్నది.. లేనిది అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు తుంబకొండలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. సీదిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంఓ డి.సూర్యనారాయణ, ఎస్‌యూఓ జె.మోహనరావు, ఎంటీఎస్ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



నవధాన్యాల కిట్లను అందిస్తున్న నార్త్ కోస్తా రీజనల్ ఆఫీసర్ ప్రకాష్ తదితరులు

గరుగుబిల్లి: జిల్లా ప్రకృతి వ్యవసాయ నార్త్ కోస్తా రీజనల్ ఆఫీసర్ కె.ప్రకాష్, జిల్లా ప్రబంధకులు పి.షణ్ముఖరాజు, సర్పంచ్ కేతిరెడ్డి శిరీష మండలంలోని నాగూరు గ్రామంలో 50 మంది రైతులకు నవధాన్యాల కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భూమిని సారవంతం చేసుకోవడానికి తొలకరి వర్షాలు ముందు పొలంలో నవధాన్యాలు వేసుకోవడం ఉత్తమమైన మార్గమని అన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా తమకున్న విస్తీర్ణంలో నవధాన్యాలను 20 నుంచి 30 రకాలు వివిధ రకాల విత్తనాలను, ఒక ఎకరాకు 10 కేజీలు చొప్పున్న వేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలను ఏ విధమైన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా లభించే వనరులను పుష్కలంగా వినియోగించుకుని పంటలు పండించుకునేలా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఆర్‌బీకేలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నవారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

సీతానగరం: మండలంలో వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి సకాలంలో వైద్య సేవలందించడం వల్ల జ్వరాలు తగ్గుముఖం పట్టాయని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రెడ్డివానివలసలో జ్వరాలు సోకడానికి గల కారణాలపై డీఎంహెచ్‌ఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, గ్రామంలో శానిటేషన్ చేయించాలని సర్పంచ్ పెంట సత్యం నాయుడికి సూచించారు. గ్రామంలో వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది నుంచి ఇక్కడి జ్వరాల పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రెడ్డివానివలసలో జ్వరాలు తగ్గుముఖం పట్టాయని, ఎండలు తీవ్రంగా ఉన్నందున ఎవరూ బయటకు రావడం లేదన్నారు. గ్రామమంతా కలియదిరిగి ఎక్కడికక్కడ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది వారం రోజులుగా గ్రామంలో ఉండి వైద్యసేవలు అందించినందున జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టినట్లు సర్పంచ్ పెంట సత్యంనాయుడు తెలియజేశారు. జ్వరాలు తగ్గినా అవసరమైన మందులను గ్రామంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచాలని పూర్తిస్థాయిలో నిర్మూలన అయ్యేవరకూ వైద్య పర్యవేక్షణ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యధికారి శిరీష, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తం

బలిజిపేట: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హోలీ స్పిరిట్ సిస్టర్ జీవా సూచించారు. మండలంలోని బర్లిలో అంటువ్యాధులు, వేసవిలో వడదెబ్బలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో పనులకు వెళ్లేవారు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురయ్యేవారికి వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని, ఎప్పటికప్పుడు మంచినీరు, మజ్జిగ తీసుకోవాలన్నారు. అదేవిధంగా అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. అంటువ్యాధులు సోకితే వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు సమయానుకూలంగా మందులు వినియోగించాలని, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బ తగలకుండా చర్యలు

సాలూరు: పని ప్రదేశంలో వడదెబ్బ తగులకుండా చర్యలు తీసుకోవాలని లేబర్ ఆఫీసర్ అంబటి సుందరరావు తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల కార్మికులతో పనులు చేయించడం నేరమన్నారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్ అందించాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



స్థల పరిశీలన చేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజనులు గృహాలు నిర్మించుకోవడానికి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలోని మర్రిగూడ, మూలగూడ, పెద్దగూడ గ్రామాల్లో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్‌తో కలిసి ఆమె బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. అటవీ స్థలాల్లో ఇళ్ల మంజూరైన వారి స్థలాలను రెవెన్యూ పరిధిలోకి వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు



ఉపాధి పనుల్లో భాగంగా ఎర్రన్నబట్టి కాలువ గండి పూడ్చివేత

పాలకొండ రూరల్: పాలకొండ – లుంబూరు గ్రామాల మధ్య ఎర్రన్నబట్టి కాలువ ద్వారా తోటపల్లి ఎడమ కాలువ నుంచి సాగునీరు అక్కడికి సమీపంలో ఉన్న గుడివాడ చెరువుకు చేరుతుంది. అక్కడి నుండి లుంబూరు, ఓని, పాలకొండ పరిధిలో పంట భూములకు సాగునీరు అందుతుంది. ఎర్రన్నబట్టి కాలువకు గత ఏడాది భారీ గండి పడింది. దాదాపు 40 అడుగుల మేరా ఈ గండి ఉండటంతో సాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. రానున్న వర్షాకాలంలో కాలువ నీరుకు తోడు వర్షపు నీరు తోడైతే రైతులకు అవస్థలు తప్పవు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ టి.ఉపేంద్రకుమార్, అక్కడి రైతులు చర్చించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని అధికారుల సూచనలతో సద్వినియోగపర్చుకున్నారు. దాదాపు 5వేల గోనె సంచులు సేకరించి దానిలో ఇసుక నింపి గండిని పూడ్చారు. త్వరలో శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. కార్యక్రమానికి సహకరించిన ఎంపీడీఓ డొంక త్రినాథులు, ఆర్.నారాయణరావు, ఎస్.నాగభూషణరావు తదితరులకు అక్కడి రైతులు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ రోగులకు ఆహారపు కిట్ల పంపిణీ



ఆహారపు కిట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్‌లు జగన్‌మోహన్‌రావు, శ్రీరాములు

సీతంపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆస్పత్రిలో జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ పేరుతో క్షయ వ్యాధిగ్రస్తులకు బుధవారం ఆహారపు కిట్లు పంపిణీ చేశారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల రెడ్‌క్రాస్ చైర్మన్‌లు ఎం.శ్రీరాములు, జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ రోగులు కోలుకోవడానికి ఈ కిట్లు అందజేస్తున్నామన్నారు. టీబీ నుంచి ఎలా రక్షించుకోవాలనేది తెలియజేశారు. 6 నెలల వరకు ఈ కిట్లు ప్రతీనెల అందజేస్తామన్నారు. జిల్లా క్షయ నివారణాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 600 మంది టీబీ రోగులు ఉన్నారని వీరందరికి దాతల సాయంతో కిట్లు ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఎం.రవీంద్రకుమార్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా తమ సంస్థ గిరిజనులకు సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయపార్వతి, ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి బి.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ వలంటీర్‌లు పి.చైతన్యకుమార్, చిన్మయిరావ్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో నాణ్యమైన విద్య



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం నాడు-నేడు పేరిట సర్కారు బడులను సమూలంగా మార్చివేసి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దిందని వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ అన్నారు. అంపిలి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో కలసి బుధవారం ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించటం ద్వారా వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విశిష్టతను తెలుపుతూ అవగాహనా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, బూరాడ తేజేశ్వరరావు, చింత సంఘంనాయుడు, హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు శశిరేఖ, కాంతారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుడి ఆగడం

- శ్మశాన వాటిక వద్ద మృతదేహం అడ్డగింత
- రెవెన్యూ సిబ్బంది రాకతో సమసిన వివాదం



రహదారిపై నిరసన తెలియజేస్తున్న రాయిపురం గ్రామస్తులు

కొమరాడ: గ్రామాల్లో శ్మశాన స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని రాయిపురం గ్రామంలో వి.రత్నాలమ్మ(60) అనే వృద్ధురాలు ఎండ తీవ్రతకు గురై బుధవారం మృతి చెందింది. శ్మశాన వాటిక వద్ద ఆక్రమణదారుడు ఆ మృతదేహం ఖననాన్ని అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. దీంతో ఆక్రమణదారుడి ఆగడాన్ని మృతురాలి బంధువులు నిరసించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ తన సిబ్బందితో అక్కడకు వెళ్లి సమస్య పరిష్కారానికి ఆదేశించారు. దీంతో మృతదేహం ఖననం పూర్తవగా, ఆక్రమణదారుడికి నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దోమలతో తస్మాత్..



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: మలేరియా వ్యాధి నివారణకు చేపడుతున్న ఏసీఎం 5 శాతం మందును ప్రతీ ఇంట్లో పిచికారీ చేయించుకోవాలని గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు అన్నారు. దోమల నివారణకు మొదటి విడత పిచికారీ పనులను మండలంలోని రెల్ల గ్రామ సచివాలయం పరిధిలోని కేసరి, కుంబాయిగూడ, కేదారిపురం గ్రామ సచివాలయం పరిధిలోని డోలుకోన, కేదారిపురం, కేడీ కాలనీ గ్రామాల్లో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతీ ఏటా మలేరియా మందును గ్రామాల్లో పిచికారీ చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ ఏడాది కూడా పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఇంటా, బయట, ఆవరణల్లో ఈ మందును పిచికారీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాడికొండ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంటీఎస్‌లు కేశవరావు, పి.రాధాకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దీప, ఏఎన్ఎం విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



లివిరి చెరువులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

భామిని: మండలంలోని లివిరి, అనంతగిరి, గజపతినగరం పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ గుర్రల కృష్ణారావు బుధవారం పరిశీలించారు. చెరువుల్లో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనుల నిర్వహణపై మస్తర్లు పరిశీలించారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున వేగంగా పనులు ప్రారంభించి ముగించాలన్నారు. ఉక్కపోత, వడదెబ్బ తగలకుండా పని ప్రదేశం వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మేట్లు ఉన్నారు.

ఖరీఫ్‌కు నీరందించడమే లక్ష్యం : ఎస్ఈ



పనులు పరిశీలిస్తున్న జల వనరుల శాఖ ఎస్ఈ సుధాకరరావు

వీరఘట్టం: ఈ ఏడాది జూలై నుండి ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు తోటపల్లి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించడమే తమ లక్ష్యమని జల వనరుల శాఖ ఎస్ఈ పి.సుధాకరరావు పేర్కొన్నారు. తోటపల్లి ప్రాజెక్టు నుండి శివారు వరకు పాత కుడి, ఎడమ కాలువల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. సుంకి వద్ద జరుగుతున్న రక్షణ గోడ పనులు, బుడ్డిడి, ఎం.రాజపురం, కత్తులకవిటి వరకు జరిగిన కాంక్రీట్ పనులతో పాటు హుస్సేనుపురం నుండి వెంకటాపురం వరకు జరుగుతున్న మట్టి పనులను కూడా పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే సరికి ప్రస్తుతం చేపడుతున్న పనులు పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు డీఈఈ దమలపాటి రవికుమార్, ఏఈలు డీవీ రమణ, పి.గౌరీశంకరరావు ఉన్నారు.